క్లుప్తంగా

దాతల సహకారం మరువలేనిది

వేంపల్లి : దాతల సహకారం మరువలేనిదని వేంపల్లి మండలశాఖ మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాత ఫిజియోథెరపీ వైద్యుడు యోగేశ్వరబాబు బీరువ వితరణ చేశారు. అనంతరం మానవతా మండల అధ్యక్షులు పోతిరెడ్డి శ్రావణ్ ఆధ్వర్యంలో మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో అభాగ్యులకు, అనాథలకు, పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మానవత లక్ష్యాలు, దిశా నిర్దేశాలు, పలు సేవా అంశాలపై చర్చించారు. ప్రాంతీయ చైర్మన్ చల్లా బాలాజీ, కార్యదర్శి శివ, కోశాధికారి శ్రీకళ, సభ్యులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లె గ్రామంలో ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నూతన వదువరులు చంద్రమోహన్‌రెడ్డి, లక్ష్మి కాళ్యాణిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల మహిళలకు శిక్షణ



మాట్లాడుతన్న నీలకంఠారెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజుల నుంచి డ్వాక్రా సంఘాల మహిళలకు ఎస్‌హెచ్ జీ, ప్రొఫైల్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రూరల్ పరిధిలోని గ్రామాలలో ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలందరు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా పీఎంబీబీ నీలకంఠారెడ్డి, ఎస్ఆర్పీలు అశ్విని, అమ్మాజాన్‌లు మాట్లాడుతూ క్లస్టర్‌లోని 7 మండలాలలకు సంబంధించిన డ్వాక్రా మహిళల సంఘాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అలాగే రుణాలు సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, ఎల్‌సీలు పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెళ్లి గ్రామంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పులివెందుల ప్రాంతం నుంచేకాక కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే ఈనెల 26న మహాశివరాత్రి పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పులివెందుల ప్రాంతంలోని భక్తులందరు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



దారిలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జమ్మలమడుగు రూరల్ : నాగలకట్ట వీధిలోని చౌడేశ్వరి ఆలయం సమీపంలో ఇంటి యజమాని రహదారిలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాడు. ఈ రహదారిలోనే కల్యాణ మండపం ఉంది. దీనికి ట్రాన్స్‌కో అధికారులు సహకరించడం దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

హరిహరుల నిలయం.. చక్రాయపేట



చక్రాయపేటలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీవేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయ ప్రాంగణం

- 26న ఒకే వేదికపై శివపార్వతులు, లక్ష్మీ వేంకటేశ్వరుల కల్యాణం
- వైభవంగా బండలాగుడు పోటీలు

చక్రాయపేట : స్థానికంగా హరిహరులకు నిలయమైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఒకే వేదికపై జరిగే శివపార్వతులు, లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణం ఘనంగా జరగనుంది.

నాటి హరిహర పురమే నేటి చక్రాయపేట

16వ శతాబ్దం కాలం నాటి ఆలయాలు ఒకే ఆవరణంలో హరి హరులుగా పిలువ బడే చక్రాయుడు (వేంకటేశ్వరుడు) రాచరాయుడు (వీర భద్రుడు) ఉండటంతో అప్పట్లో దీన్ని హరిహరపురం అని పిలిచేవారు. ఆకాలంతో సుమారు వెయ్యి కుటుంబాలకు చెందిన లింగాయితులు ఇక్కడే ఆవాసం ఉంటూ పూజాది కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇక్కడ చక్రాయుడు ఉన్నందున ఇందుకు గుర్తుగా చక్రాయపేటకు సమీపంలోని చిలేకాంపల్లె వద్ద రైతుల శ్రేయస్సు కోసం చెరువును తవ్వించి దానికి చక్రాయచెరువుగా నామకరణం చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. అనంతరం హరిహరపురాన్ని చక్రాయపురంగా మార్చినట్లు తాళపత్ర గ్రంధాల్లో ఉందేవని పెద్దలు చెబుతున్నారు. అనంతరం వచ్చిన ఆంగ్లేయుల పాలనలో చక్రాయపురం కాస్త చక్రాయపేటగా మారింది.

గుప్తనిధుల కోసం

ఇక్కడ ఉన్న లింగాయితులు జీవనోపాదుల నిమిత్తం వలసలు వెళ్లి పోయారు. ఈ ఆలయాల్లో గుప్త నిధులు ఉన్నాయని తవ్వకాలు కూడా జరిపారు. చివరకు ఆలయాల్లో దీపం వెలిగించే నాధుడే కరువయ్యారు. ఆలయాలు పూర్తిగా శిథిలమయ్యాయి.

వైఎస్సార్ హయాంలో..

శిథిలావస్థకు చేరిన ఆలయాల దుస్థితిపై దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వాటి పునర్నిర్మాణం కోసం సుమారు రూ.45 లక్షల నిధులు మంజూరు చేయించారు. రూపురేఖలు దిద్దుకున్న ఆలయాల్లో నేడు అత్యంత వైభవంగా వేడుకలు జరుపుకుంటున్నారు. ఆలయాల పాలక మండలి కూడా వాటి అభివృద్ధి కోసం అందరినీ భాగస్వాములను చేస్తోంది.

ఈనెల 26న మహాశివరాత్రి పండుగ సందర్భంగా వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఒకే వేదికపై శివపార్వతులు, లక్ష్మీ వేంకటేశ్వరుల కల్యాణం జరుపుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు, రాత్రి హరి కథలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి న్యూ కేటగిరీ ఎద్దుల పోటీల్లో మొదటి బహుమతి రూ.70వేలు, రెండవ బహుమతి రూ.50వేలు, మూడవ బహుమతి రూ.40వేలు, నాల్గవ బహుమతి రూ.30వేలు, ఐదవ బహుమతి రూ.20వేలు, ఆరవ బహుమతి రూ.15వేలు, ఏడవ బహుమతి రూ.10వేలు, ఎనిమిదవ బహుమతి రూ.5వేలు ఇస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. పోటీల్లో పాల్గొన్న మిగిలిన ఎద్దులకు కన్సొలేషన్ బహుమతి కింద రూ.5వేలు ఇస్తామన్నారు.



చక్రాయపేటలో వెలిసిన రాచరాయస్వామి

ప్రజా సమస్యలపై పోరాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సెషన్లు ప్రారంభమవుతున్నాయనని, ఈ సెషన్లలో ప్రజా సమస్యలపై పోరాడాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ, మండలిలో రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా చర్చించాలని సూచించారు.కడప పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ నియోజకవర్గాల్లోని ప్రజల ఆందోళనలు, అవసరాలను ప్రతిబింబించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సహకారం



స్నాక్స్ అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

జమ్మలమడుగు : మైలవరం మండలం వేపరాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సహకారాన్ని అందిస్తున్నారు. 73 మంది విద్యార్థులకు ప్రతి రోజు స్నాక్స్ ఏర్పాటు చేశారు. గత ఏడాది నవంబర్ నుంచి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో స్టడీ అవర్స్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం ఐదు గంటల వెళుతున్నారు. సైన్సు ఉపాధ్యాయుడు నరసింహులు నవంబర్ నుంచి ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతి రోజు స్నాక్స్ ఏర్పాటు చేయటానికి కావలసిన డబ్బులను పూర్వ విద్యార్థులు సమకూర్చారు.

ఘనంగా ఆవులస్వామి ఆరాధనోత్సవం



స్వామిని దర్శంచుకుంటున్న భక్తులు



స్వామిని దర్శంచుకుంటున్న వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : మండలంలోని అంబకపల్లెలో వెలసిన ఆవులస్వామి ఆరాధానోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ తేజారెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కర్నూల్, అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామిని ఎంపీ దర్శించుకుని తీర్థ ప్రసాదులు అందుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పులివెందుల, ముదిగుబ్బ ప్రాంతాలనుంచి ఆర్టీసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మధుసుదన్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు. పంచరత్నాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, బండి శివారెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, గంగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్ -2 మెయిన్ పరీక్ష రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రూప్- 2 మెయిన్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షలను రోస్టర్ విధానంలో లోపాలు ఉన్నప్పటికీ, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా ఈ నెల 23న నిర్వహించడంపై రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-2 అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారని తెలిపారు. రోస్టర్ వ్యవస్థపై స్పష్టత లేకపోవడం, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు అభ్యర్థుల్లో నిరుత్సాహాన్ని పెంచాయన్నారు.

వంతెన వెడల్పు తగ్గించవద్దని ఆందోళన



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

కమలాపురం : మండల పరిధిలోని సీ గోపులాపురం గ్రామంలోకి వెళ్లడానికి రైల్వే లైను కింద వున్న వంతెన కొలతలను తగ్గించడానికి రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. వంతెన వెడల్పు తగ్గిస్తే తమ గ్రామంలోకి వాహనాలు రావడానికి అవరోధంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ గ్రామ ప్రజలు ఆదివారం అడ్డుకున్నారు. కొలతల తగ్గింపు వలన కనీసం స్కూల్ వ్యాన్, అంబులెన్స వంటి వాహనాలు కూడా గ్రామంలోకి రావడానికి వీలు వుండదని, అలాంటి పరిస్థితుల్లో తాము గ్రామంలో ఎలా జీవించాలని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలోకి వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేటును ఇప్పటికే మూసి వేశారని, తాము ప్రస్తుతం రాక పోకలు సాగిస్తున్న ఇప్పుడున్న బ్రిడ్జి కొలతను కూడా తగ్గిస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది నీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన వంతెన మాత్రమేనని, ప్రజలు వెళ్లడానికి రస్తా కాదంటూ రైల్వే అధికారులు పేర్కొనడంతో మా ఊరికి దారేదంటూ గ్రామస్తులు వారిని ప్రశ్నించారు. తాము ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చామని, తమకు సంబంధం లేదని తెలిపిన రైల్వే అధికారులు, గామస్తుల వీడియోలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివరామిరెడ్డి, రమణారెడ్డి, బాలురెడ్డి, కేశవరెడ్డి, రాంబాబు, సుబ్బయ్య, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్న దానం



పులివెందులలో వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న రామ్‌లక్ష్మణ్‌రెడ్డి



లింగాల : వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలసి కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి 74వ జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో అందుల అనాథాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంబకపల్లె నారాయణ స్వామి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా కార్యదర్శి నీలవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ షమీఉల్లా, తొండూరు మండల యువజన నాయకులు మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కాంప్లెక్స్‌లో కొంగణపల్లె రవి, దాసరి చంద్రమౌళి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అలాగే కడియం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

లింగాలలో..

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చంచల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైఎస్ భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వృద్ధుల సమక్షంలో నిర్వహించారు. వృద్ధుల చేత కేకును కట్ చేయించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్య, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, బలిజ సంఘం నాయకులు సోఫాల వీర, పెద్ద వీరయ్య, ఆర్సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఎంపీ కార్యాలయ సిబ్బంది రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వల్లూరు : మండలంలోని గంగాయపల్లెలో వున్న పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను సోమవారం నుంచి స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసక్తి గల విద్యార్థులు మార్చి 31వ తేదీలోపు డబ్ల్యూ.డబ్ల్యూ. డబ్ల్యూ.ఏపీ.జీవోవీ.ఐఎన్ లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీ.ఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20 తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ షీట్స్ ద్వారా జరుగుతుందన్నారు. ఏప్రిల్ 27వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారన్నారు. ఏప్రిల్ 30 తేదీ నుండి మెరిట్, రిజర్వేషన్‌ల ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ప్రవేశ పరీక్షలో ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు కనీస మార్కులుగా నిర్ణయించారన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్‌ప్రసాద్

వేంపల్లె : స్థానిక మెయిన్‌బజార్‌లోని ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్, కడప నవీన్ న్యూరో కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యూరో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కడపకు చెందిన ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్.నవీన్ ప్రసాద్ 305 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా షుగర్ వ్యాధి పరీక్ష, బీపీ వ్యాధి పరీక్ష, ఎముకల సాంద్రత పరీక్ష, నరాల పటుత్వ పరీక్షలు, తదితర జబ్బులకు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారని తెలిపారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్‌కుమార్, అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారి



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. పులివెందులలోని ప్రభాకర్ లగ్జరీ విహార్ కమ్యూనిటీ లేఅవుట్ వారి సహకారంతో ధర్మవరం రాకింగ్ స్టార్స్ డ్యాన్స్ అకాడమి మాస్టర్ లోకేష్, అస్లాంలు తమ చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు చిన్నారుల నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. సందర్శకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రభకర్ లగ్జరీ విహార్ అధినేత ప్రభాకర్‌రెడ్డి, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా బీసీ రుణాలు



రుణాల కోసం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు వచ్చిన లబ్ధిదారులు(ఫైల్)

ఎర్రగుంట్ల : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మంజూరు చేయనున్న బీసీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. 17 గ్రామ పంచాయతీలు ఉన్న ఎర్రగుంట్ల మండలానికి కేవలం 34 బీసీ రుణాలను మాత్రమే మంజూరు చేశారు. దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నాటి నుంచి రుణాల పంపిణీపై రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో.. అర్హతలు ఉన్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలను గుప్పించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పదవీ కాలంలో పింఛన్ల పెంపు పథకాన్ని తప్ప మరే ఇతర పథకాన్ని అమలు చేసిన పాపాన పోలేదు. ఏడాది మూడు సిలిండర్లు ఉచితగ్యాస్ హామీ పథకాన్ని అమలు చేసినట్టు ప్రభుత్వం ఊదర గోడుతున్నా సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమకావడం లేదంటూ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూరు తిరగలేక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేమంటూ కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో బీసీ రుణాలను మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల మండలానికి 34 బీసీ రుణాలు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి 30 రుణాలు మంజూరు అయ్యాయి. మండలంలో సుమారు 427 దరఖాస్తులు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో 250 దరఖాస్తులు వచ్చాయని అధికారులు ద్వారా తెలిపారు.

మండలం:	ఎర్రగుంట్ల
బీసీ రుణాల యూనిట్లు :	34
దరఖాస్తులు సుమారు :	427
మున్సిపాలిటీ:	ఎర్రగుంట్ల
బీసీ రుణాల యూనిట్లు :	30
దరఖాస్తులు సుమారు :	250


రుణాల సంఖ్యను పెంచాలి

బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. ఆర్థిక వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో స్వయం ఉపాధిని కల్పించేందుకు బీసీ రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం మండలానికి కేవలం 34 రుణాలు మాత్రమే మంజూరు చేయడం దారుణం. ఈ సంఖ్యను వెంటనే పెంచి ప్రతి గ్రామానికి 15 నుంచి 20 మందికి రుణాలు మంజూరు చేయాలి

– తమ్మిశెట్టి బాలయ్య, జెడ్పీటీసీ, ఎర్రగుంట్ల



ఇస్లాం మార్గం.. అనుసరణీయం



మాట్లాడుతున్న ముఫ్తి అబ్దుల్ హాది

కమలాపురం : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఇస్లాం మార్గం ప్రజలకు అనుసరణీయం అని ముఫ్తీ అబ్దుల్ హాది తెలిపారు. ఆదివారం స్థానిక ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో తన్‌జీముల్ మకాతిబ్ కమలాపురం వారి ఆధ్వర్యంలో రెండవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని 14 మదరసాలలో దీనియాత్, ఖురాన్ షరీఫ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంశా పత్రాలు, మెడల్స్ బహూకరించారు. అలాగే విద్యార్థులకు వివిధ రకాల పద్య, గద్య భాగ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఫ్తీ అబ్దుల్ హాది మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైన అబద్ధాలు మాట్లాడరాదన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా దాన ధర్మాలు ఎక్కువగా చేయాలన్నారు. రంజాన్ మాసంలో ఒక్క రుపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందన్నారు. మద్యం, వ్యభిచారం జోలికి వెళ్లకూడదన్నారు. ప్రతి ముస్లిం 5 పూటల నమాజ్ ఆచరించాలన్నారు. ప్రవక్త సూచించిన మార్గంలోనే నడవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం పాల్గొన్నారు.

పూల తోట కాదు.. పొగాకు పంట



పొగాకు పంట

పెద్దముడియం : ఈ చిత్రంలో కనిపిస్తున్నది పూల తోట అనుకుంటే పొరపాటు. ఇది పొగాకు పంట. మండల పరిధిలోని పెద్ద పసుపుల, ఎస్.కొట్టాలపల్లె, జె.కొట్టాలపల్లె, జంగాలపల్లె గ్రామాల్లో సాగు చేసిన పంట. రోడ్డుపై నుంచి చూస్తే పూల తోటను తలపిస్తోంది. పాదచారులు, ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.